ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 09.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు జాలికంటే గౌరవం , అవకాశాలు కల్పించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

2. జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే తెలంగాణ వంటి రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

3. ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక రాజ్యాంగబద్ధ సంస్థలపై అ సత్య ప్రచారాలు చేయడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు.

4. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా ప్రారంభించారు.

**గవర్నర్**

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు గౌరవం , అవకాశాలు కల్పించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్ రెడ్‌హిల్స్ లో నిర్వహించిన మాధవ్ ఆటిజం ఫౌండేషన్ 10వ వార్షికోత్సవంలో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ఆటిజం వ్యాధి కాదని , నాడీ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితి అని చెప్పారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలపై అపోహలు తొలగించి , వారిపై జాలి చూపడం కంటే గౌరవం, అవకాశాలు కల్పించడమే ముఖ్యమని పేర్కొన్నారు. వారి అభివృద్ధికి సమాజం , అధికారులు, వైద్యులు సమష్టిగా కృషి చేసి సమ్మిళిత వాతావరణాన్ని, భరోసాను అందించాలని పిలుపునిచ్చారు.

డెస్క్

**భట్టి విక్రమార్క మల్లు**

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి , ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. న్యూఢిల్లీలో జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. నిజాయితీ పన్నుదారులకు సులభతర విధానాలు అమలు చేస్తూనే , నకిలీ రిజిస్ట్రేషన్లు , పన్ను మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో జీఎస్టీఎన్ , జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు, స్క్రాప్ రంగంపై మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

డెస్క్

**సీతక్క**

తెలంగాణ సంస్కృతి , ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగను గ్రామీణ ప్రాంతాల్లో ఆనందంగా , సురక్షితంగా నిర్వహించేలా పారిశుద్ధ్యం , విద్యుత్, తాగునీటి ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆమె , విదేశాల్లోనూ తెలంగాణ బిడ్డలు ఈ పూల పండుగను జరుపుకోవడం గర్వకారణమని పేర్కొంటూ రాష్ట్ర ఆడబిడ్డలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

డెస్క్

**సంజయ్ జాజు**

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు టీ.జీ.ఓ. మహిళా విభాగం రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఆవిష్కరించారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు బతుకమ్మ నిదర్శనమని పేర్కొంటూ , మహిళా ఉద్యోగులందరూ ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డెస్క్

**గ్రేటర్ వరంగల్**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఈరోజు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హన్మకొండ పరిధిలోని హసన్‌పర్తి , భీమారం చెరువులను సందర్శించి ఉత్సవాలు , నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. మహిళలు , చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా వేడుకల్లో పాల్గొనేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చెయ్యాలని కమిషనర్ సూచించారు.

పిటిసి, వరంగల్

**ఎంపీ డీకే అరుణ**

జూరాల నీటి విడుదల కోసం పోరాటం చేస్తున్న రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడాన్ని ఎంపీ డీకే అరుణ తప్పుబట్టారు...మహబూబ్‌నగర్ లో ఎంపీ మీడియా తో మాట్లాడుతూ బెదిరింపులకు రైతులు భయపడరని , పంటలను కాపాడుకునేందుకు నీటి కోసం పోరాటం కొనసాగిస్తారని స్పష్టం చేశారు. జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నందున ఎడమ , కుడి కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

Byte : ఎంపీ డీకే అరుణ

పిటిసి, మహబూబ్ నగర్

**దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెన్ బుడ్లిగర్ ఆర్టియేడా నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో పర్యటించి , టి-హబ్, టి-వర్క్స్, స్కైరూట్ సంస్థలను సందర్శించింది. ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఫలక్‌నుమా ప్యాలెస్‌లో వీరికి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ 2026'కు వారిని ఆహ్వానించడంతో పాటు, స్విస్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడుల ఆకర్షణపై చర్చించారు.

డెస్క్

**కేటీఆర్**

భారత రాజ్యాంగం కంటే ఏదీ గొప్పది కాదని , పౌరుల ఓటు హక్కును ఎవరూ తొలగించలేరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. నిర్బంధ సర్వే ప్రక్రియ అక్రమాలపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి , సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

డెస్క్

**ఇందిరమ్మ ఇళ్లు**

తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ CURE ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో సవరణలు , క్లెయిమ్‌లు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అధికారిక పోర్టల్ ద్వారా నియోజకవర్గం , కేటగిరీ మార్పులతో పాటు తిరస్కరణలపై సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

సహాయం కోసం కాల్ సెంటర్ నంబర్ 040-24603572 ను సంప్రదించాలని సూచించారు.

డెస్క్

**కిషన్ రెడ్డి**

కాంగ్రెస్ పార్టీకి అనుకూల తీర్పులు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్లు ప్రచారం చేయడం, ఓడిపోయినప్పుడు రాజ్యాంగ సంస్థలపై అబద్ధాలు ప్రచారం చేయడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సంఘం , సుప్రీంకోర్టు, సీఏజీ, సైన్యం, విద్యాసంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా ప్రవర్తించడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. వరుస ఓటములను తట్టుకోలేక అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను దిగజార్చే కుట్రలు మాని , ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు.

డెస్క్

**బండి సంజయ్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ భవానీ దీక్ష చేపట్టారు. ఈ ఉదయం 10 గంటలకు కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మాలాధారణ గావించి ఎర్రని వస్త్రాలు ధరించి అమ్మవారి దీక్ష చేపట్టారు.

పిటిసి, కరీంనగర్

**వాకిటి శ్రీహరి**

హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నిన్న ప్రారంభించారు. భారతీయ సంస్కృతి , ఇతిహాసాల్లో విలువిద్యకు విశిష్ట స్థానం ఉందని , ఈ క్రీడ యువతలో ఏకాగ్రత , క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. తెలంగాణలో క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్న మంత్రి , ఏషియన్ గేమ్స్ స్వర్ణ పతక విజేత చికితా రావుతో పాటు పలువురు ఆర్చరీ క్రీడాకారులను సన్మానించారు.

డెస్క్

**పాల్వాయి హరీష్ బాబు**

బతుకమ్మ పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్-కాగజ్‌నగర్ మధ్య ఈనెల 25 వరకు 17 రోజుల పాటు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ రైలు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బైట్ ... హరీష్ బాబు, బిజెపి ఎమ్మెల్యే

పిటిసి, ఆసిఫాబాద్

**ఖమ్మం**

2016లో ప్రారంభమైన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ఉచిత పరీక్షలు , స్కానింగ్, మందులు అందిస్తున్నారు. మాతృ , శిశు మరణాలను తగ్గించడమే

లక్ష్యంగా హై రిస్క్ కేసులను గుర్తించి తగిన వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ యామిని తెలిపారు.

బైట్ : డాక్టర్ యామని

పిటిసి, ఖమ్మం

**జాతీయ పోషణ్ మాసం**

జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకొని , రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మన అంగన్వాడి.. మన బాధ్యతలో భాగంగా నిన్న సాయంత్రం జిల్లా స్థాయి పోషణమేళా , ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

బైట్: లక్ష్మీరాజం, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

పిటిసి, సిరిసిల్ల